# ఆకువచ్చి ముల్లుమీదపడినా, ముల్లువచ్చి ఆకుమీద పడినా..........

జి.యమ్. గారు రమ్మన్నారనే కబురు మోసుకొని వచ్చాడు బంట్రోతు.

కొత్తదే అయినా సమంగా పని చెయ్యని యంత్రానికి మరమ్మత్తు చేస్తున్న నేను ఆశ్చర్యంతో ఆగిపోయాను.

మాలాంటి సాధారణ ఇంజనీర్‌లని జి.యమ్.గారు పిలవటము చాలా అరుదు. అటు యాజమాన్యానికి, ఇటు కార్మికులకూ చెందని మేము కర్మాగారములో శిఖండిలాంటి వాళ్ళము. మేము యాజమాన్యానికి చెందినవారమని యాజమాన్యపు వారు అంటూ వుంటారు కానీ, ప్రతీదినము కనీసం ఎనిమిది గంటలయినా కలసి పనిచేయటం వల్ల ఏర్పడిన సాన్నిహిత్యము వల్ల మేము అంటే కార్మికులకే ఎక్కువ ఆప్యాయత, సానుభూతి. అందువల్లే యాజమాన్యానికి, కార్మికులకూ జరిగే కురుక్షేత్రాలలో కార్మికులని, నిరాయుధులను చేయటానికి మాలాంటి ఇంజనీర్లని శిఖండిలా వాడుతూ వుంటారు యాజమాన్యపువారు.

“జి.యమ్. గారు పిలిస్తే ఇంకావెళ్ళవేమిటిరా?” పనిలోంచి కదలని నన్ను అడిగాడు నా సహోద్యోగి.

“జి.యమ్. గారు నన్ను పిలవటమేమిటిరా” చేతులు, మొహము తుడుచుకొంటూ అన్నాను. “నేనేం తప్పు చేసానని?”

“సంవత్సరం అయిపోయిందికదా. ఉద్యోగం ఖాయం చేస్తారేమో” అతను అన్నాడు.

నిజమే! ఈ ఉద్యోగంలో చేరి సంవత్సరం అయిపోయింది. ఎన్ని సంవత్సరాల అనుభవం ఉన్నా కొత్త ఉద్యోగంలో చేరితే ఓ సంవత్సరకాలము తాత్కాలికముగా పనిచెయ్యటం తప్పదు. బహుశ ఉద్యోగం ఖాయం చేస్తున్నారని చెప్పొచ్చు. ఇంక్రిమెంటు

కూడా యివ్వవచ్చు. అలాంటి సందర్భములోనే జి.యమ్. గారి నుంచి పిలుపు వస్తుంది.

గబగబా అడుగులు వేసాను. మా వర్క్ షాపు నుంచి ఆఫీసుకి వెళ్లే రహదారికి యిరువైపులా నాటిన గులాబీమొక్కలు పూలతో నిండి అందంగా కనిపించాయి. కానీ, వాటి మధ్యన లేచిన కలుపుమొక్కలు ఎదిగి, అసలు మొక్కలని అణచివెయ్యడము చూసి నాకు బాధ కలిగింది. కలుపుమొక్కలని అదుపులో పెట్టవలసిన వారు సమంగా పనిచెయ్యక పోవటం నాకు చికాకు కలిగించింది.

జి.యమ్. గారిని ఒక్కసారే కలిసాను నేను. ఉద్యోగంలో చేరిన నాలుగు నెలలకు పిలిచారతను. ఆఫీసులో కలవమని.

"కూర్చో" పైపులో పొగాకు వేసుకుంటూ అన్నారు అతను. "నీ ఉద్దేశం ఏమిటో నా కర్థం కావటం లేదు." అతను పైపు వెలిగించారు. "మీమీద వచ్చే కంప్లయింట్స్ వినలేక చస్తున్నాను."

"అదేమిటి సార్!" నేను మెల్లగా అన్నాను." నేను బాగానే పనిచేస్తున్నాను కదండీ?"

"అని నువ్వు అనుకొంటే చాలదు. నేను చెప్పాలి. అయినా పనిచేసేటప్పుడు, చేయించేటప్పుడు కొన్ని పద్ధతులని అనుసరించాలి కదా? నీ షిఫ్టులో ఏ క్రమశిక్షణా లేదట కదా? టయింగాని టయంలో కేంటీనుకు, వెళ్ళటం, రావటం...."

"అయినా పని పూర్తవుతోంది కదండీ?"

"పని పూర్తిచేస్తే చాలదు. క్రమశిక్షణకూడా వుండాలి" అతను గట్టిగా పొగపీల్చి వదిలాడు. "నీవు కార్మికులతో కలసి పార్టీలు చేసుకొంటున్నావట. వాళ్ళ యిళ్ళకు తిరుగుతున్నావట.."

నిజమే కార్మికులైనా, ఇంజనీర్లయినా కలసి, మెలసి వుండాలని, అది ఉత్పత్తిని పెంచుతుందని అంతవరకూ నేను పనిచేసిన యాజమాన్యపు నమ్మకం. అందుకే అలాగే చేస్తూ వున్నాను. అది తప్పని నేను అనుకోలేదు.

"ఇలా అయితే నీవు కార్మికులని ఎలా అదుపులో పెడతావ్? నాకు ఇదేమీ నచ్చలేదు. నాకే కాదు మన మేనేజర్స్ ఎవ్వరికీ కూడా నచ్చలేదు. వాళ్ళే నీ గురించి కంప్లయింట్ చేసారు".

"కార్మికులతో కలసిమెలసి వుండాలనీ మీరు కూడా అన్నారుకదండీ, మీటింగ్‌లో"

"చెప్తామయ్యా. మాట్లాడేటప్పుడు వంద చెప్తాం" అతను మరోసారి పైపులో పొగాకు వేసుకున్నాడు. "కార్మికులతో స్ట్రిక్ట్‌గా వుండండి. మరోసారి మేనేజర్స్ కంప్లయింట్స్ చేస్తే నీకు బాగుండదు".

బయటకు వచ్చాను.

పూర్తిగా ప్రకాశించటానికి ప్రయత్నిస్తున్న సూర్యుని దొంగచాటుగా వెనుకనించి వచ్చి కప్పివేస్తున్నాయి నల్లని మబ్బులు.

"లోనికి వెళ్ళండి" జి.యమ్. గారి కేబిన్ తలుపు తెరుస్తూ అన్నాడు బంట్రోతు.

జి.యమ్. గారి మొహం వేపు చూడలేకపోయాను నేను. అతను సూటులో గుచ్చుకున్న, గులాబీ మొగ్గ కన్నా ఎర్రగా వుంది అతని మోము.

"నువ్వు యింకో ఉద్యోగం ఏమైనా చూసుకున్నావా?" గదిలోకి అడుగుపెట్టగానే అడిగేరు అతను. అడుగులు పడలేదు. నేను ఆగిపోయాను.

"ఏంటిసార్. మీరంటున్నది!" మెల్లగా గొణిగాను.

"కార్మికులతో తగాదాలు పెట్టుకుంటూ ఎన్నాళ్ళు చెయ్యకలుగుతావు ఉద్యోగం?"

నేనేమీ మాట్లాడలేకపోయాను. అంతా అయోమయంగా వుంది నాకు.

"చాలా స్ట్రిక్ట్‌గా వుంటున్నావట. ఓ నిముషము కూడా ఊపిరి పీల్చనివ్వకుండా పని చేయిస్తున్నావట. ఓ నిముషం ఆలస్యమయితే చార్జ్‌షీటు యిస్తానంటున్నావట. ఏమిటి సంగతి?"

"వాళ్ళతో స్ట్రిక్ట్‌గా వుండమని మీరేకదండీ చెప్పారు?"

"అవునయ్యా చెప్పాను. అయితే మాత్రం? దేనికయినా కాస్త పట్టువిడుపు వుండాలి కదా. అసలే వాళ్ళు "నిరసన వ్రతంలో" ఉన్నారు కదా? యిప్పుడా నీవు విజృంభించటం? వాళ్ళతో కలసి మెలసి వుండి నయంగా పనిచేయించుకోక...."

"మరి మీరు అప్పుడు....."

"అప్పటి పరిస్థితులు అవి. చూడు కార్మికులు అంతా నీ మీద విరుచుకు పడుతున్నారు. నిన్ను బదిలీ చెయ్యమని కార్మిక నాయకుడు వ్రాసి యిచ్చాడు. వాళ్ళతో గొడవపెట్టుకోవటం నాకు యిష్టం లేదు. నీ పద్ధతులు మార్చుకోవాలయ్యా"

"అంటే"

"బాగా అర్ధం చేసుకో నీవు యాజమాన్యానికి, కార్మికులకి మధ్యస వారధిలాంటివాడివి. ఇకనైనా జాగ్రత్తగా వుండటం నేర్చుకో, నీ మంచిని కోరి చెప్తున్నాను. ఆకు వచ్చి ముల్లు మీదపడ్డా ముల్లు వచ్చి ఆకు మీద పడ్డా ఎవరికి నష్టమో ఆలోచించుకో"

నా కళ్ళు బైర్లు కమ్మాయి. వెనక్కు నడిచాను.

జి.యమ్. గారి కుర్చీ వెనుక గోడమీద వున్న కృష్ణుడి ఛాయాచిత్రం నన్ను చూసి వెటకారంగా నవ్వుతున్నట్టు తోచింది నాకు.

రాఘవన్ కోకిల మే -1996